

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## శీతవేళ రానీయకు

**"అమ్మా! అమ్మోయ్"** తలుపు తాళం తీసుకుని లోపలికి వచ్చిన సమీర తల్లిని వెదుక్కుంటూ వంటగదిలోకి వెళ్ళింది.

రాత్రి వంటకి కూరలు తరుగుతున్న వరూధిని కూతుర్ని చూసి నవ్వుతూ అడిగింది.

"ఏమిటి గాలి దుమారంలా వచ్చావు?" ట్రైనింగ్ క్లాస్ ఎలా వుంది? ఇన్స్ట్రక్టర్ బాగా అర్థమయ్యేలా చెప్పాడా? తెల్లాయనా? నల్లాయనా?"

"కలనేత ఆయనగాని ముందు నేను చెప్పేది విను." సమీర విసుక్కుంది.

"సరే పద. కూర్చుని మాట్లాడుకుందాం" నేప్కిన్‌తో చేతులు తుడుచుకుంటూ వరూధిని హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చుంది.

"అమ్మా! టి.వి పెట్టకు. చెప్పేది విను ముందు" సమీర తల్లి పక్కన కూర్చుంది.

"సరే చెప్పు" వరూధిని అనాసక్తిగా అడిగింది.

సమీరకి ప్రతీది వింతే. ప్రతీది ఆశ్చర్యమే. దాన్ని తల్లితో పంచుకునేదాకా ఊరుకోదు. ఆ కబుర్లలో వరూధినికి ఆసక్తిగా ఉండేవి చాలా తక్కువ.

"మాకు ట్రైనింగ్ ఇవ్వడానికి అమెరికానించి వచ్చింది మన ఇండియనే. ఆయన క్లాస్ అయ్యాక నన్ను ఒక నిమిషం ఉండమని చెప్పాడు. అంతా వెళ్ళాక ఆయన నన్ను 'మీకు రాజేంద్ర ఏమవుతారు?' అని అడిగాడు."

వరూధిని గుండె లయ తప్పింది.

"ఎవరతను? పేరేంటి?" ఆత్రంగా అడిగింది.

"అబ్బ! ఉండు. వివరంగా చెప్తున్నాకదా" సమీర విసుక్కుంది.

"సరే. చెప్పు"

"నేనేమో రాజేంద్ర మా నాన్నే అని చెప్పాను."

"అనుకున్నాను. మీది అచ్చం మీ నాన్న పోలికే. ఆయనెలా ఉన్నారు?" అని అడిగాడు.

రెండేళ్ళక్రితం పోయారని చెప్పాను.

"'అయ్యో!' అని చాలా బాధపడ్డాడు. తర్వాత 'వరూధినిగారు ఎలా ఉన్నారు?' అని అడిగాడు"

అతనెవరో వరూధినికి అర్థమైపోయింది.

"వనమాలా?" గొంతుపెగుల్చుకుని అడిగింది.

"అవును. భలే చెప్పావే. ఆయన పేరు వనమాలే. మిడిల్ ఏజ్డ్ అందగాడు. నువ్వు బానే ఉన్నావని. నా దగ్గరే ఉన్నావని చెప్పాను. రెండు మూడురోజుల్లో మనింటికి వచ్చి నిన్ను కలుస్తానన్నాడు. మళ్ళీ వారంలో యు.ఎస్ వెళ్ళిపోవాలి కదా" సమీర చెప్తూనే వుంది.

"వరూధినీ! నా శృంగార దేవతా" వనమాలి కంఠం వరూధిని చెవుల్లో గుసగుసగా వినిపిస్తోంది.

"వరూ. మా ఫ్రెండ్ శ్రీధర్ గుర్తున్నాడా?" ఓ రాత్రి రాజేంద్ర అడిగాడు.

"గుర్తున్నాడు. ఏమైందాయనకి?" వరూధిని భర్తకి వడ్డిస్తూ అడిగింది.

"ఏమీ కాలేదు. రేపు వాళ్ళ తమ్ముడితో మనింటికి వస్తున్నాడు. ఆ కుర్రాడు ఓ వారం పదిరోజులపాటు మనింట్లో ఉంటాడనుకుంటా."

అన్నం కలుపుకుంటున్న వరూధిని తలెత్తి భర్తవైపు చూసి ఆశ్చర్యంగా అడిగింది. "ఏమిటేమిటి? వివరంగా చెప్పండి. ఆ కుర్రాడెవరో మనింట్లో ఎందుకుంటాడు? ఏం పని?"

"శ్రీధర్‌కి ఒంగోలు ట్రాన్స్‌ఫరైంది కదా? వాళ్ళ తమ్ముడు ఈ ఏడాదే ఇంజనీరింగ్ పాసయ్యాడు. ఇప్పుడు కొత్తగా ఏవో కంప్యూటర్ కోర్సులు వచ్చాయిగా. వాటిలో చేరి, అమెరికా పోవాలని వాడి ప్లాన్. శ్రీధర్‌కి సెలవులు ఎక్కువలేవుట. రేపు మనింట్లో వాడిని దింపి, రేపు రాత్రికి వెళ్ళిపోతాడట. తమ్ముడు ఓ వారం, పదిరోజుల్లో రూమ్ చూసుకుని వెళ్ళిపోతాడు. అందాకా మనింట్లో ఉండచ్చా అని పాపం చాలా మొహమాటంగా అడిగాడు."

".....మీరు సరేనన్నారు. ఇంట్లో ఇంకో మనిషుంటే ఎంత ఇబ్బందో తెలుసా మీకు? ఆడవాళ్ళ కష్టాలు అసలు అర్థం చేసుకోరు. మీరు ఆఫీస్‌కి పోతే ఇంట్లో ఉండేది, వాడు నేను" వరూధిని విసురుగా చెప్పింది.

"ఐతే ఏం నిన్నేమన్నా కొరుక్కుతింటాడా? వాడు ఇరవై ఏళ్ళ కుర్రాడు" రాజేంద్ర కొట్టిపారేసాడు.

"అవునండీ. ముప్పై పై బడ్డ శ్రీధర్‌కి ఇరవై ఏళ్ళ తమ్ముడేంటి? ఒక అమ్మ పిల్లలేనా?" వరూధిని స్త్రీ సహజ కుతూహలంతో అడిగింది.

"రేపు వస్తారుగా. వాళ్ళనే అడుగు." రాజేంద్ర చెయ్యి కడుక్కున్నాడు.

శ్రీధర్ వెనక బెరుకుగా లోపలికి వచ్చాడు ఆ కుర్రాడు.

"మా తమ్ముడండీ. వనమాలి. వైజాగ్ ఆంధ్రాయూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసాడు" శ్రీధర్ పరిచయం చేసాడు. వాళ్ళకి మంచినీళ్ళు అందించడానికి వంగినప్పుడు నేలని తాకిన జడని వెనక్కి వేసుకుంటున్న వరూధిని వనమాలి చూపులకి ఉలిక్కిపడింది. అతను ఆమె వంక ఆరాధనగా చూస్తున్నాడు.

ఆ మధ్యాహ్నం శ్రీధర్ తమ్ముడిని అమీర్‌పేటలోని ఓ కంప్యూటర్ సెంటర్లో చేర్చి ఆ రాత్రి రైలుకి ఒంగోలుకి వెళ్ళిపోయాడు. క్లాసులు ఉదయం తొమ్మిదినించి మధ్యాహ్నం ఒంటిగంటదాకా.

మొదటిరోజు మధ్యాహ్నం ఇంటికి వచ్చిన వనమాలి తలుపు తీసిన వరూధినిని ఓ నిమిషం పాటు చూస్తూండిపోయాడు.

"కాళ్ళు కడుక్కురా. అన్నం వడ్డిస్తా" ఆ చూపులకి ఇబ్బంది పడిన వరూధిని చెప్పింది.

"మీకు రేఖ అంటే ఇష్టమా?" వనమాలి చూపులు మరల్చకుండా అడిగాడు. అతని సునిశిత దృష్టికి వరూధిని ఆశ్చర్యపోయింది. వరూధినికి తను రేఖలా ఉంటానని నమ్మకం. దాంతో ఆమెలా తయారయ్యేది. కొంచెం పెద్దబొట్టు, విరబోసిన జుట్టు, వి నెక్ జాకెట్... రాజేంద్ర ఈ పోలికని అసలు గుర్తుపట్టలేదు. ఒక్క చూపులో వనమాలి గుర్తించాడు.

"ఏమోయ్! ఎలా ఉంది కోర్స్? బాగా చెప్తున్నారా?" ఆ రాత్రి భోజనాల దగ్గర రాజేంద్ర అడిగాడు.

"బానే ఉందండి. కొంతమంది మా బేచ్ మేట్స్ ఆ దగ్గరలోనే రూమ్స్ తీసుకుని ఉంటున్నారట. నాకు అకామడేషన్ ఇస్తారా అని అడిగాను. రేపు చెప్తామన్నారు" వనమాలి వినయంగా చెప్పాడు.

"తొందరలేదులే. గది సౌకర్యంగా ఉందా, నీళ్ళు వస్తాయా లాంటివన్నీ చూసుకుని నిదానంగా మారు. పర్లేదు" రాజేంద్ర అభిమానంగా చెప్పాడు.

వనమాలి మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేయగానే తనగదిలోకి వెళ్ళిపోయేవాడు. సాయంత్రం రాజేంద్ర వచ్చాకే బయటకి వచ్చేవాడు.

"వీడి చూపులు గుచ్చుకునేలా ఉంటాయి కానీ మనిషి మంచివాడు. " అతనికన్నా ఎనిమిదేళ్ళు పెద్దదైన వరూధిని రెండు రోజులు తర్వాత అనుకుంది.

మూడోరోజు మధ్యాహ్నం వనమాలి తన గదిలోకి వెళ్ళలేదు. హాల్లో కూర్చుని పుస్తకం చదువుతున్న వరూధిని పక్కన కూర్చున్నాడు. ఆమె బిత్తరపోయింది. ఆమె జుట్టుని గుప్పెటతో పట్టుకుని పారవశ్యంగా చెప్పాడు.

"దీంతో ఉరేసుకోవాలని ఉంది. అంతకంటే సుఖమైన చావు ఉంటుందా?"

"ఏయ్! ఏం మాట్లాడుతున్నావు? లే నా పక్కనించి" వరూధిని కంగారుగా అరిచింది. వనమాలి ఆమె ముందు నేలమీద కూర్చుని ఆమె పాదాలని తాకుతూ చెప్పాడు.

"ఎంత సున్నితంగా, సుకుమారంగా ఉన్నాయండీ మీ పాదాలు? నేను మీ ఇంటికి రాగానే మొదట చూసింది ఈ లేత పాదాలనే"

భయంతో వరూధిని ఒక్క ఉదుటన లేచి బెడ్ రూంలోకి పరిగెత్తింది. ఆమె వెనకే లోపలికి వెళ్ళిన వనమాలి ఆమెకి బోల్ట్ వేసే అవకాశం ఇవ్వలేదు.

"వరూధినీ! మీరు శృంగార దేవత. మీ శరీరంలో, మీ ప్రతి కదలికలో, ప్రతీ చర్యలో శృంగారం ఒలికిపోతూంటుంది. దేవుడెంత అన్యాయం చేసాడు.! మిమ్మల్ని ఒక్క పదేళ్ళు ఆలస్యంగా పుట్టిస్తే, యుద్ధాలు చేసైనా దక్కించుకునేవాడిని."

అతని వేళ్ళు అనాచ్ఛాదితంగా ఉన్న ఆమె నడుముని సున్నితంగా స్పృశిస్తున్నాయి.

"వెళ్ళిపో. ప్లీజ్! నీకు దండంపెడతా" ఆ స్పర్శని భరించలేని ఆమె చేతులు జోడించి అరిచింది.

వనమాలి వంగి ఆమె బుగ్గమీద సుతారంగా ముద్దుపెట్టి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపోయిన వరూధిని శిల్పంలా చాలాసేపు అలాగే ఉండిపోయింది. ఆమెకి చిత్రంగా వనమాలిమీద కాక రాజేంద్ర మీద విపరీతమైన కోపం వచ్చింది.

నాలుగోరోజు వరూధిని భయంతో కూడిన ఆసక్తితో అతడి కోసం ఎదురుచూసింది.

"ఎంతైనా అత్తయ్యగారు మాంచి టేస్ట్ ఉన్న మనిషండీ" వనమాలి భోజనం చేస్తూ చెప్పాడు.

"ఆవిడెవరు?" వరూధిని తెల్లబోయింది.

"ఇంకెవరు? మీ అమ్మగారు. మీకు వరూధిని అని కరెక్ట్ పేరు పెట్టారు. నా లాంటి ప్రవరాఖ్యుడ్ని పిచ్చివాడ్ని చేస్తారని ఆవిడకి ముందే తెలుసు." నవ్వాడు.

వరూధినికి కూడా నవ్వొచ్చింది.

"మా నాయనమ్మ పేరు వరలక్ష్మి. దాన్ని కాస్త మార్చి మా నాన్న వరూధిని అని పెట్టారు" చెప్పింది.

"అబ్బబ్బా! అప్రియమైన నిజం ఎందుకు చెప్తారండి. ప్రియమైన ఆ అబద్ధంతో ఆనందపడనీయచ్చుగా?" దీనంగా అడిగాడు.

వరూధిని ఈసారి నవ్వాపుకోలేకపోయింది.

"నువ్వు చదివింది ఇంజనీరింగా? తెలుగు లిటరేచరా?" అడిగింది.

"వైజాగ్‌లో ఉన్నప్పుడు నాకు అసలు తెలుగులో అ ఆ ఇ ఈలు రావండీ. మిమ్మల్ని చూడగానే కవిత్వం కూడా వచ్చేస్తోంది" చేతులు ఆమె కొంగుకి తుడుచుకుంటూ చెప్పాడు.

"ఏయ్! ఏం చేస్తున్నావ్? బుద్ధిగా నీ గదిలోకి వెళ్ళి చదువుకో. లేదా మావారితో చెప్తాను" బెదిరించింది.

"దాన్ని కృత్రిమ ఆగ్రహం అంటారు. లేదా కోపం, చెప్పేవారైతే నిన్నే చెప్పేవారు. చెప్పరని నాకు తెలుసు." కొంటెగా నవ్వుతూ వనమాలి చటుక్కున ఆమె పెదవులని తాకాడు.

రాజేంద్ర నించి ఎన్నడూ అలాంటి పొగడ్తలు, చిరు స్పర్శలు ఎరగని వరూధిని సులభంగానే వనమాలికి లొంగిపోయింది. వనమాలి అందాన్ని ఆరాధించే భావుకుడు. ఆమె మీద కవిత్వాలు కట్టేవాడు. మెచ్చుకునేవాడు. అరుదుగా ఆమెని ఏకవచనంలో సంబోధించేవాడు.

"వరూధినీ! నువ్వు శృంగారదేవతవి. అసలు నువ్వు అన్నం తింటావా? నీ పొట్ట ఎంత లోతుగా, ప్రపోర్షనేట్‌గా ఉంటుందో తెలుసా?" ఆమె పొట్టమీద వేలితో రాస్తూ చెప్పేవాడు.

మూసి వున్న ఆమె కళ్ళని ముద్దాడేవాడు. నడుస్తూంటే నడుంని తాకేవాడు. వరూధినిని కాక ఆమె అందాన్ని ఆరాధించేవాడు వనమాలి.

పదిరోజుల తర్వాత రూం చూసుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు రోజు చెప్పాడు.

"నేనిక మీ ఇంటికి రానండి. ఇక్కడికి వస్తే పిచ్చివాడినైపోతాను. నాకీ ప్రపంచమే గుర్తుండదు. ఇంతవరకు ఈ రహస్యం రహస్యంగానే ఉంది. రాజేంద్రగారు మంచి మనిషి. ఏ మాత్రం కల్మషం లేకుండా నేను మీ ఇంట్లో ఉండడానికి ఒప్పుకున్నారు. ఆయన ముందు కంట్రోల్ తప్పుతానేమోనని అనుమానంగా ఉంది అది మీకు, నాకు కూడా మంచిదికాదు."

అలజడి సృష్టించిన తుఫాను తీరం దాటినట్లు నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు వనమాలి. మళ్ళీ ఆమెకి కనిపించలేదుకాని ఆ అలజడి వరూధినిని చాలాకాలం వేధించింది.

దాదాపు ముప్పై ఏళ్ళ తర్వాత వనమాలి మళ్ళీ తన జీవితంలోకి వస్తున్నాడు. వరూధిని దీర్ఘంగా నిట్టూర్చింది. ఆమెకి ఆ రాత్రి నిద్రపట్టలేదు. గులాబీని తాకినంత సున్నితంగా తనని స్పృశించిన వనమాలి, తనని నగ్నంగా చూసి కవిత్వాలు చెప్పిన వనమాలి, తన చెవిలో గుసగుసలాడిన వనమాలి ఇప్పుడు మిడిల్ ఏజ్డ్ అందగాడు. మరి తనో?

వరూధిని ఉలిక్కిపడింది. వెంటనే బాత్‌రూంలోకి వెళ్ళి అద్దంలో తనని తాను చూసుకుంది. వనమాలి ఉరేసుకుని సుఖంగా చచ్చిపోతానన్న జుట్టు లేదు. చిన్న పిలక మిగిలింది. తుమ్మెదల్లా సంచరించే కళ్ళకింద నల్లటి వలయాలు, కళ్ళజోడు. నడుం ముడతలు పడితే, పొట్ట వెడల్పయింది. అందాలు జారిపోయాయి. పాదాలు పగిలిపోయి, ఆ పగుళ్ళలో మట్టిచేరి అసహ్యంగా ఉన్నాయి. పసిడి రెక్కలు విసిరి కాలం పారిపోయిన జాడలు మిగిలాయి.

రాజేంద్ర మరణంతో తనలో ఏర్పడిన నిర్లిప్తత తాలుకు ప్రభావాన్ని వరూధిని నిర్ఘాంతపోతూ చూసింది.

"హలో అమ్మా. ఏమిటి ఈ టైంలో ఫోన్ చేసావు. ఆఫీస్‌కి చేయవుగా. నువ్వు బానే ఉన్నావా?" సమీర కంగారుగా అడిగింది.

"బానే ఉన్నా మీరా. అన్నయ్యని చూడాలనిపిస్తోంది. విజయవాడ వెళ్తున్నా. రైల్లో ఉన్నాను" వరూధిని చెప్పింది.

"అయ్యో అంత హఠాత్తుగా ఏమిటి? వనమాలిగారు ఈ రోజు మనింటికి వస్తానన్నారు. ఛ! ఏంటమ్మా మర్యాద లేకుండా..." సమీర మాటలు వినబడటంలేదు వరూధినికి. ఆమె కళ్ళు, మనసుకూడా వర్షిస్తున్నాయి.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments